బస్సు కండక్టర్‌పై దాడి దురదృష్టకరం

●బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలి.
గాయపడిన ప్రవళికను పరామర్శించిన నేత.
● బాధితురాలు త్వరగా కోలుకోవాలి
● కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / అక్టోబర్ 30 / అక్షరం న్యూస్ –: : విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ బస్సు కండక్టర్‌పై జరిగిన దాడి అత్యంత దురదృష్టకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. మణుగూరు డిపోకు చెందిన కండక్టర్ గుండ్ల ప్రవళికపై ఇటీవల ప్రయాణికులు దాడి చేసి బస్సు కిందకు తోసేయడంతో ఆమె రెండు కాళ్లతో పాటు శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లోని సాయి సంజీవిని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని శుక్రవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్వయంగా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రవళిక ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య చికిత్స వివరాలను అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. జరిగిన ఘోర ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, బాధితురాలికి ఎలాంటి లోటు లేకుండా అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కొత్తగూడెం పట్టణ పరిధిలోని రామవరం ప్రాంతానికి చెందిన ప్రవళిక, తండ్రి మరణానంతరం వచ్చిన వారసత్వ ఉద్యోగంతో కుటుంబాన్ని పోషిస్తోందని గుర్తుచేశారు. కష్టపడి పనిచేసే ఇలాంటి ఉద్యోగులపై దాడులు జరగడం విచారకరమన్నారు. ఈ కష్ట సమయంలో ఆమె కుటుంబానికి ధైర్యం చెప్పి, బాధితురాలు సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాల్లో భాగంగా మెగా రక్తదాన శిబిరం

●ం ప్రాణదానంతో సమానం -- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్.



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / అక్టోబర్ 30 / అక్షరం న్యూస్ –:

పోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం కొత్తగూడెం క్లబ్‌లో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవలను ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సైకిల్ ర్యాలీ, బైక్ ర్యాలీ, వ్యాసరచన పోటీలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలతో పాటు అన్ని సబ్ డివిజన్ల పరిధిలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, అత్యవసర సమయాల్లో రక్తం ఎంతమందికి ప్రాణదానం చేయగలదనే విషయాలను వివరిస్తూ, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం సమాజానికి అందించే గొప్ప సేవ అని పేర్కొన్నారు.ఈ మెగా రక్తదాన శిబిరంలో విద్యార్థులు, యువకులు, మహిళలు, రాజకీయ ప్రముఖులు, పోలీస్ అధికారులు, సిబ్బంది, దివ్యాంగులు తదితరులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం వారికి పండ్లు, పండ్ల రసాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎంహెచ్ఓ తుకారం నాయక్, కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి, జితేందర్, యాసిన్, ఇంద్రసేనారెడ్డి, కరుణాకర్, నరేష్, ఆర్ఐలు రవి, లాల్‌బాబు, కృష్ణారావు, పోలీస్ అధికారులు, సిబ్బంది, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



భారత కార్మిక పోరాట దిక్సూచి ఏఐటీయూసీ

●106 ఏళ్ల ఘన చరిత్ర కార్మిక వర్గానికే సొంతం.
● కార్మిక చట్టాల పరిరక్షణకు కదలాలి.
● కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాం
● సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా.



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / అక్టోబర్ 30 / అక్షరం న్యూస్ –: : భారత కార్మిక వర్గ పోరాటాలకు అసలైన దిక్సూచి ఏఐటీయూసీ మాత్రమేనని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా స్పష్టం చేశారు. స్థానిక పెద్దబజార్లోని హమాలీ అడ్డాలో శుక్రవారం జరిగిన హమాలీ కార్మికుల సమావేశంలో అయన మాట్లాడారు. ఈ 106 సంవత్సరాల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన ఘనత ఏఐటీయూసీకి మాత్రమే దక్కుతుందన్నారు. దేశంలో కార్మికులు రక్తం ధారపోసి సాధించుకున్న హక్కులను కేంద్ర పాలకులు కాలరాస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల వల్ల అసంఘటిత, సంఘటిత రంగ కార్మికుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను రద్దు చేస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేయడం దుర్మార్గమన్నారు. అక్టోబర్ 31న జరుపుకుంటున్న ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రజాస్వామ్య పరిరక్షణ దినంగా ఈ వార్షికోత్సవాన్ని నిర్వహించుకోవాలని, ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో కార్మిక హక్కుల సాధనే లక్ష్యంగా కదలాలన్నారు.. పాలకుల అణచివేత చర్యలను తిప్పికొట్టడానికి కార్మికులంతా ఏకతాటిపైకి వచ్చి ఉద్యమించాలన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాటాలు నిర్మిస్తామని ఆయన శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్మిక ఐక్యతే ఆయుధంగా ముందుకు సాగి చట్టాలను కాపాడుకోవాలన్నారు. హమాలీల సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. పాలకుల విధానాలపై రాబోయే రోజుల్లో సమరశీల పోరాటాలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తరాల రాజు, నీలం మొగిలి, వెలిశాల మోహన్ రావు, కత్తెర శ్రీనివాస్, అశోక్, సర్పంచ్ రామనాథం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం సహించేది లేదు: కలెక్టర్ అంకిత్





● గుండాల ఏకలవ్య పాఠశాలలో లోపాలపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి.. ప్రిన్సిపాల్‌కు మెమో, వంట మనిషిని తొలగించాలని ఆదేశం.
● మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.. మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలి.
● భూ రీ సర్వే పనులు వేగవంతం చేయాలి.. రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలి.

భద్రాద్రి కొత్తగూడెం / గుండాల / అక్టోబర్ 30 / అక్షరం న్యూస్ –:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం విస్తృతంగా పర్యటించి భూ రీ సర్వే పనులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.గుండాల రెవెన్యూ పరిధిలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ సర్వే పురోగతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 10,390 ఎకరాల విస్తీర్ణంలో 6,694 ఎకరాలు అటవీ భూములుగా ఉన్నాయని, అటవీ శాఖ గెజిట్ ప్రకారం నిర్దేశించిన హద్దులు, ఎన్‌క్లోజర్ లేయర్ల ఆధారంగా మిగిలిన భూముల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 950 ఎకరాల్లో సర్వే పూర్తికాగా, అందులో 561 ఎకరాల ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించినట్లు సిబ్బంది వివరించారు.రైతుల సమక్షంలోనే భూముల హద్దులను నిర్ధారించాలని, వారి పేర్లు, సంతకాలు, ఆధార్, మొబైల్ వివరాలను ఫీల్డ్ రిజిస్టర్లలో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. పహాణీ, పట్టాదారు పాస్ పుస్తకాల వివరాలతో పాటు ప్రస్తుతం సాగు చేస్తున్న రైతుల వివరాలను కూడా నమోదు చేయాలన్నారు. అటవీ, అసైన్డ్, రెవెన్యూ భూములకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, రైతుల అభ్యంతరాలను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. సర్వే పూర్తయిన అనంతరం హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని, భూ రీ సర్వే ప్రక్రియను నవంబర్ 15వ తేదీలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీజీపీఎస్ పరికరాల పనితీరును కూడా పరిశీలించారు.అనంతరం గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అక్కడ అందిస్తున్న వైద్య సేవలు, రక్త పరీక్షలు, మందుల నిల్వలు, వైద్య పరికరాల లభ్యతపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మందుల గదిని పరిశీలించగా అత్యవసర వైద్య అవసరాలకు ఉపయోగించే సిరంజీలు అందుబాటులో లేకపోవడాన్ని గుర్తించి కారణాలను ప్రశ్నించారు. ఇంటర్నెట్ సమస్యల కారణంగా మందులు, వైద్య సామగ్రి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇప్పటికే ఇండెంట్ పెట్టామని వైద్యాధికారులు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సిరంజీలు, అవసరమైన మందులు, వైద్య పరికరాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.అనంతరం సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం, మందులు, భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. మారుమూల ప్రాంత ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు.అనంతరం గుండాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న విద్యా బోధన, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, భోజన సదుపాయాలను పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులు లేకపోవడాన్ని గమనించి, తరగతుల సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఏమిటని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, సాంస్కృతిక కార్యక్రమాలను సెలవు రోజుల్లో నిర్వహించుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు.పాఠశాల మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వంటశాల, స్టోర్ రూమ్‌ను పరిశీలించగా బంగాళాదుంపలు కుళ్లిపోయి ఉండటం, పంచదారలో చీమలు పట్టి ఉండటాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన వంట మనిషిని విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్ సాంబార్, రసం పలుచగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోజు ప్రభుత్వ మెనూ ప్రకారం బిర్యానీ వడ్డించాల్సి ఉండగా, అందుకు అనుగు ణంగా భోజనం సిద్ధం చేయకపోవడాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని స్పష్టం చేశారు.పాఠశాలలో విద్యార్థుల హాజరు, బోధన, పారిశుద్ధ్యం, భోజన నాణ్యత, ఆహార పదార్థాల నిల్వలో గుర్తించిన లోపాలపై ప్రిన్సిపాల్‌కు మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన వసతులు, పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ పర్యటనలో సర్పంచ్ రాధా, తహసీల్దార్ సంగీత, ఎంపీడీవో బాలరాజు, ఎంఈఓ పార్వతి, ఎంపీవో త్రిలోక్, సర్వేయర్ శివకృష్ణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సొంతింటి కలకు ఇందిరమ్మ ఇళ్లతో సాకారం

●మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్.



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/అక్టోబర్ 30/అక్షరం న్యూస్: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అ న్నారు. శు క్రవారం ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పోసాన్‌పల్లి,గండి మాసానిపేట, కొత్తపల్లి గ్రామాల్లో ఇం ది రమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసి, ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూ జ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మె ల్యే మదన్ మోహన్ సహకారంతో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతోంద న్నా రు.ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాలకుఎంతో ప్ర యోజనకరంగా నిలుస్తుందని, సొంత ఇల్లు లేని నిరుపే దల కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చే స్తోం దని తెలిపారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టి ప్రభుత్వ పథకాన్ని సద్వినియో గం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, కౌన్సిలర్లు చంద్రయ్య, తిరు ప్రశాంత్ గౌడ్, రాములు, శంకర్ తదితరులు పతి, దశరథం, సిద్ధి శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణతోనే బంగారు భవిష్యత్తు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్.
- పోక్సో చట్టం, బాలల భద్రతపై అవగాహన తప్పనిసరి.
- పాత పాల్వంచ జెడ్పీహెచ్ఎస్‌లో 'సురక్షిత్ బచ్‌పన్ అభియాన్'.



భద్రాద్రి కొత్తగూడెం / పాల్వంచ / అక్టోబర్ 30 / అక్షరం న్యూస్ –:
చిన్నారుల హక్కులను కాపాడటం, వారికి సురక్షితమైన వాతావరణాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎం. రాజేందర్ పేర్కొన్నారు. 'సురక్షిత్ బచ్‌పన్ అభియాన్' (సురక్షిత బాల్యం అభియాన్) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాత పాల్వంచలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, వ్యక్తిగత భద్రత మరియు బాలల రక్షణ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా పోక్సో చట్టం, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, బాలలపై జరిగే వేధింపులు, దోపిడీ మరియు ఇతర నేరాల నివారణకు సంబంధించిన చట్టాలను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అర్థమయ్యే రీతిలో వివరించారు.ఏదైనా ఆపద లేదా వేధింపులు ఎదురైనప్పుడు పిల్లలు భయపడకుండా, తమ సమస్యలను ఉపాధ్యాయులకు లేదా తల్లిదండ్రులకు నిర్భయంగా చెప్పుకునేలా పాఠశాలల్లో స్నేహపూర్వక, సురక్షిత వాతావరణాన్ని కల్పించాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. బాలల భద్రత పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి, అనుమానాస్పద ఘటనలు దృష్టికి వచ్చినప్పుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.బాలల రక్షణ మరియు హక్కుల పరిరక్షణపై విద్యార్థుల చేత న్యాయమూర్తి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం. పావని, జూనియర్ న్యాయవాది బి. మంగీలాల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మరియు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలి

పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలి

- నల్ల బ్యాడ్జీలు ధరించి మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన.



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/అక్టోబర్ 30/అక్షరం న్యూస్: మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉపాధ్యా యులు నిరసన కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్న భో జన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సంబంధిం చిన పెండింగ్ బిల్లుల నిధులనుప్రభుత్వం వెంటనే మం జూరు చేయాలని కోరారు.అదేవిధంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వారి సేవల ను గుర్తించి ఉద్యోగ భద్రతపై ప్రభుత్వం స్పష్టమైన హా మీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కళా శాల ప్రిన్సిపల్ గాంధీ,వైస్ ప్రిన్సిపల్ ఆల్తమష్ జహంగీర్, ప్రియదర్శిని, లక్ష్మణ్ సింగ్, రాజశేఖర్, బలవంతరావు, విద్యారమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్టేల్ పోటీలకు ఐదుగురు వెల్ది మోడల్ స్కూల్ విద్యార్థినులు ఎంపిక



జనగామ జిల్లా/రఘునాథపల్లి/(అక్షరం న్యూస్)అక్టోబరు 30: రాష్ట్ర స్థాయి సాఫ్ట్బాల్ పోటీలకు మండలంలోని వెల్ది మోడల్ స్కూల్కు చెందిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కె.మోక్షిత, ఎం.హాసిని, ఎన్.సౌమ్య, ఎస్.సహర్షతో పాటు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇ.శ్రీనిఖిల అనే ఐదుగురు విద్యార్థినులు ఎంపికయినట్లు ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్ తెలి పారు. జిల్లా స్థాయి జూనియర్ సాఫ్ట్బాల్ బాలబాలికల పోటీలలో మోడల్ స్కూల్కు చెందిన ఐదుగురు విద్యార్థినులు అత వ్యత్తమ ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబరు 31, నవంబరు 1, 2 తేదీలలో నిర్మల్ జిల్లా కేం ద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల సాఫ్ట్బాల్ పోటీలలో ఐదుగురు విద్యార్థినులు పాల్గొంటారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ గడ్డం జయశ్రీ, ఉ పాధ్యాయులు కందగట్ల గణేష్, మల్లం శ్రీధర్, పొరిక పార్వతి, తుమ్మ రవి, బాలరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు మార పాక రాజయ్య, బైరి వెనిల్ కుమార్ ఐదుగురు విద్యార్థినులను అభినందించి, రాష్ట్ర స్థాయి పోటీలలోను అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

జీవో నెంబర్ 76 లో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపించాలి

- లక్ష్మణ్ అగర్వాల్ కుటుంబ సభ్యుల,స్నేహితుల ఇంటి పట్టాల దరఖాస్తులు రద్దు చేయాలి.
- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్.



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / అక్టోబర్ 30 / అక్షరం న్యూస్ –: 76 జీవోలో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపించాలని, కాంగ్రెస్ నాయకుడు లక్ష్మణ్ అగర్వాల్ కుటుంబ సభ్యులు, స్నేహితుల ఇంటి పట్టాల దరఖాస్తులు తిరస్కరించాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు కాంగ్రెస్,సిపిఐ పార్టీల రాజకీయ నాయకులతో,ప్రజా ప్రతినిధులతో కుమ్మక్కై లక్షల రూపాయలతో ఇంటి పట్టాలు మాట్లాడుకుని,కోట్ల రూపాయల ప్రభుత్వ స్థలాలను కబ్జాదారులకు కట్టబెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. గతంలో ఐదవ వార్డు గంగాబిషన్ బస్తీలో కాంగ్రెస్ నాయకుడు లక్ష్మణ్ అగర్వాల్ తన కుటుంబ సభ్యులు, స్నేహితులు ఎనిమిది మందితో సుమారు 5,175 గజాలకు దరఖాస్తు చేసుకొనగా వాటిని రెండుసార్లు తిరస్కరించడం జరిగిందని అంతకు పూర్వం సదరు స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే 2019లో నాటి కలెక్టర్ రజత్ కుమార్ షైనీ అట్టి నిర్మాణాలను కూల్చివేసి అక్కడ రైతు వేదిక ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. మరల అట్టి స్థలంలో దరఖాస్తులపై విచారణ జరిపించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అదేవిధంగా గతంలో గొల్లగూడెం 16వ వార్డు నందు సుమారు 1500 గజాల ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టగా నాటి తహసీల్దార్ అట్టి నిర్మాణాలను కూల్చివేయడం జరిగిందని మరల ఇప్పుడు 1500 గజాలకు ముగ్గురు పేర్లపై కమ్యూనిస్టు నాయకుడు ఇంటి పట్టాలకు దరఖాస్తులు చేయించింది వాస్తవం కాదా అని నిలదీశారు!??అదేవిధంగా ఎంజీ రోడ్డులో దేవాదాయ శాఖకు సంబంధించిన భూమి విషయమై హైకోర్టులో కేసు పెండింగ్ ఉండగా అట్టి స్థలానికి కూడా దరఖాస్తులు చేయడం, దానికి రెవెన్యూ అధికారులు సహకరించడం సరైనది కాదన్నారు. జలగం వెంకట్రావు శాసనసభ్యులుగా ఉన్నప్పుడు కొత్తగూడెం పట్టణంలో ప్రభుత్వ స్థలాలపై ఎన్ని బోర్డులు ఏర్పాటు చేయడం జరిగింది, ఇప్పుడు అట్టి స్థలాలలో ఎన్ని స్థలాలు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి,ఎన్ని స్థలాలు కబ్జాలకు గురి అయ్యాయో ఎమ్మెల్యే కూనంనేని సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికారులు స్పందించి గతంలో తిరస్కరించబడి మరల ఇప్పుడు విచారణ చేపడుతున్న ఇంటి పట్టాల దరఖాస్తులపై ఉన్నత స్థాయి కమిటీ వేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్, బీమా, మురళి, కార్తీక్, అనిత తదితరులు పాల్గొన్నారు.


రైతు సంక్షేమానికి ములుకనూరు సహకార సంఘం ఆదర్శం

- కీమాజీ మంత్రి డాక్టర్ జి. చిన్నారెడ్డి.



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ అక్టోబర్ 30/ అక్షరం న్యూస్:–
రైతు సంక్షేమం సహకార రంగ అభివృద్ధికి ములుకనూరు సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సంఘం ఒక గొప్ప నిదర్శనమని ఈ అభివృద్ధి నమూనా దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలవాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ జి. చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని ములుకనూరు సహకార సంఘాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా సంఘం ఆవిర్భావం నుంచి నేటి వరకు సాగిన ప్రస్థానం రైతుల ఆర్థిక అభ్యున్నతి కోసం చేపడుతున్న కార్యక్రమాలను ఆధునికీకరణ చర్యలను సంఘం అధికారులు లఘుచిత్రం ద్వారా వివరించారు. అనంతరం సంఘంలో నిర్వహిస్తున్న వివిధ వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లను సందర్శించి. వాటి పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు.అనంతరం చిన్నారెడ్డి మాట్లాడుతూ.. ఇంతటి అద్భుతమైన సహకార సంస్థను సందర్శించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దూరదృష్టితో కూడిన నాయకత్వం రైతుల పట్ల నిబద్ధత సేవాభావం ఉంటే సహకార రంగంలో ఎంతటి అభివృద్ధినైనా సాధించవచ్చని ములుకనూరు సంఘం నిరూపించిందని కొనియాడారు. ఈ సంఘం అభివృద్ధి వెనుక దివంగత ఎ.కె. విశ్వనాథరెడ్డి స్ఫూర్తిదాయకమైన నాయకత్వం ఎంతో ఉందని గుర్తుచేశారు.ప్రస్తుత సంఘం అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి 18 గ్రామాల రైతు కుటుంబాల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని బాధ్యతాయుతంగా అంకితభావంతో సంఘాన్ని ముందుకు నడిపిస్తున్న తీరు అభినందనీయమని ప్రశంసించారు. సహకార సంఘాలు రెండు వైపులా పదునున్న కత్తి లాంటివని వాటిని నడిపించే నాయకత్వం నిబద్ధతతో మానవీయ విలువలతో ఉంటే సమాజంలో గొప్ప మార్పులకు నాంది పలకవచ్చని పేర్కొన్నారు.రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలంటే రాజకీయాలకు అతీతంగా సహకార వ్యవస్థలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణాలోనే కాకుండా దేశంలోని ప్రతి ప్రాంతంలోనూ ములుకనూరు తరహా బలమైన సహకార సంఘాలు ఏర్పడాలని ఆకాంక్షించారు. రైతుల ఆర్థిక స్వావలంబనకు గ్రామీణాభివృద్ధికి ఇలాంటి సంస్థలు మరింత దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ గంటా జలంధర్‌రెడ్డి, రొండ్ల సందీప్, సంఘం జనరల్ మేనేజర్ ఎం. రాంరెడ్డి, ఏజీఎం సతీష్‌రెడ్డి, వేణుమాధవ్‌తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన పెయింటింగ్ కూలీ దుర్మరణం



జనగామ జిల్లా/ రఘునాథపల్లి/(అక్షరం న్యూస్) అక్టోబరు 30: వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై వైట్ లైన్ మార్కింగ్ వర్క్ చేస్తున్న ఐదుగురిని హైదరాబాద్ నుండి హన్మకొండ వైపు వెళ్తున్న లారీ అతి వేగంగా ఢీ కొనడంతో మిషన్ తో వైట్ లైన్ వర్క్ చేస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నీరజ్ (19) అక్కడికక్కడే మృతి చెందగా, నలుగురు వ్యక్తులకు గాయాలైన సంఘటన మం డలంలోని గోవర్ధనగిరి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. ఎక్కడో పుట్టి... ఎక్కడో పెరిగి... పొట్ట కూటి కోసం ఇక్కడికి వచ్చి... ఇక్కడే... అసువులు బాసిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నీరజ్ తో పాటు మరో నలుగురు వ్యక్తులు గోవర్ధనగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. జాతీయ రహదారిపై నీరజ్ తో పాటు నలుగురు వ్యక్తులు మిషన్తో వైట్ లైన్ మార్కింగ్ వేస్తున్న క్రమంలో హైదరాబాద్ నుండి హన్మకొండకు వెళ్తున్న లారీ అతి వేగంగా వచ్చి వైట్ లైన్ వర్క్ చేస్తున్న మిషన్ ను ఢీ-కొంది. ఘటనలో నీరజ్ మృతి చెందగా, నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. మృతదేహాన్ని జనగామ జిల్లా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ప్రమాదానికి లారీ డ్రైవర్ అతి వేగమే కారణమని స్థానికులు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతు న్నట్లు ఎస్సై భరత్ తె లిపారు

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609